క్లుప్తంగా

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు
–మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలోని మురుగు సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 7,8 వార్డుల్లో శనివారం జరుగుతున్న మురుగు కాల్వల షిల్ట్ పనులను ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురుగు కాల్వల్లో వ్యర్థాలు వేయటం వలన పారుదల నిలిచిపోతుందని చెప్పారు. దుకాణ యజమానులు, ప్రజలు వ్యర్థాలను కాల్వల్లో వేయవద్దని సూచించారు. ఆమె వెంట ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె హెలెన్ నిర్మల, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, డీఈ నాగభూషణం, ఏఈ ఫణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాజీ, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆటో,లారీ ఢీ: ముగ్గురికి గాయాలు

తెనాలిరూరల్: ఆటోను లారీ ఢీ కొట్టిన ఘటనలో ముగ్గురు గాయాలపాలయ్యారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి మండలం పెదరావూరు ప్రధాన కూడలి వద్ద శుక్రవారం రాత్రి తెనాలి వైపు వస్తున్న ఆటోను ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో బోల్తా పడడంతో అందులోని ముగ్గురు గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను 108లో తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ పి. కోటేశ్వరరావు తెలిపారు.

27న రామాచార్యులు విగ్రహావిష్కరణ

తెనాలిటౌన్: బీజేపీ నేత టి.రామాచార్యులు విగ్రహాన్ని ఈ నెల 27న ఆవిష్కరిస్తున్నట్లు రామాచార్య స్మారక కమిటీ అధ్యక్షుడు టి.అనంతాచార్యులు తెలిపారు. గంగానమ్మపేటలోని వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం మీడియా సమావేశంలో వివరాలు తెలియజేశారు. త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రాసేనారెడ్డి చేతుల మీదుగా రామాచార్యులు విగ్రహావిష్కరణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తెనాలి శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్, బీజేపీ నాయకులు యడ్లపాటి రఘునాథబాబు, తదితరులు పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు అడపా సంపత్‌రాయుడు, అర్చక సమాఖ్య జిల్లా కార్యదర్శి టి.రఘు, వైఖానస సేవా సంఘం అధ్యక్షుడు ఎం.శ్రీనివాస మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పరిమళిస్తున్న పేదింటి విద్యా కుసుమాలు

- అమ్మ ఒడితో చిన్నారుల జీవితాల్లో కొత్త వెలుగులు
- తెనాలి నియోజకవర్గంలో 93,391 మందికి లబ్ధి



తెనాలిలోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయం

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అమ్మఒడి పథకం పేద విద్యార్థుల పాలిట వరంగా మారింది. గతంలో ఆర్థిక ఇబ్బందులతో విద్యకు దూరం అయిన ఎంతో మంది పేదింటి విద్యా కుసుమాలు నేడు పాఠశాలల్లో ఆనందంగా చదువులు సాగిస్తూ అమ్మఒడి పథకం ఆసరాతో ఇబ్బందులను అధిగమించి చదువులు సాగిస్తున్నారు. ప్రభుత్వం ప్రతి ఏడాది ఈ పథకం ద్వారా రూ.15వేల నగదును నేరుగా విద్యార్థి తల్లి బ్యాంక్ ఖాతాలో జమ చేయటంతో వారు ఆనందంగా తమ పిల్లలను బడికి పంపుతూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. తెనాలి పట్టణం, మండల పరిధిలో 110 ప్రభుత్వ పాఠశాలలు, కొల్లిపర మండల పరిధిలో 40 పాఠశాలలు ఉన్నాయి. ఇవి కాకుండా తెనాలి పట్టణంలో వందకు పైగా ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఇంటర్మీడియట్ కళాశాలలు 17 ఉన్నాయి. వీటిలో సుమారు 42 వేలకు పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

అమ్మఒడితో ఆర్థిక భరోసా

సాధారణంగా పేద కుటుంబాలకు చెందిన కొందరు తల్లిదండ్రులు ఆర్థిక పరిస్థితులు సహకరించక తమతో పాటు తమ పిల్లలను సైతం కూలి పనులకు తీసుకువెళ్తూ విద్యకు దూరం చేస్తుంటారు. అలాంటి వారు చదువుకు దూరం కాకూడదనే గొప్ప సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టారు. దీని ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు ఏడాదికి రూ.15వేల చొప్పున అందిస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను పాఠశాలలు/ కళాశాలలకు పంపేందుకు ఆసక్తిని చూపుతున్నారు.

విద్యా సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	జమైన నగదు రూ.కోట్లలో
2019-20	25,850	38.77
2020-21	25,471	38.20
2021-22	21,213	31.81
2022-23	20,857	31.28

నియోజకవర్గంలో 93,391 మందికి లబ్ధి

తెనాలి నియోజవర్గ పరిధిలోని తెనాలి పట్టణంలో ఏడాదికి సగటున 11,074 మందికి అమ్మఒడి కింద రూ.16.61 కోట్ల నగదును అందజేస్తుండగా మండల పరిధిలోని 5,833 మంది విద్యార్థులకు రూ.8.74 కోట్ల నగదును, కొల్లిపర మండల పరిధిలోని 3,950 మంది విద్యార్థులకు రూ.5.92 కోట్ల నగదును జమ చేశారు. నాలుగేళ్లలో నియోజకవర్గ పరిధిలోని 93,391 మంది విద్యార్థులకు రూ.141 కోట్ల నగదును జమ చేశారు.

ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయాయి



నా భర్త మేస్త్రీ పని చేస్తాడు. అతని సంపాదనతో ఇద్దరు బిడ్డలు చదువుతున్నారు. వారి చదువుల కోసం అప్పుడప్పుడు ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొనేవాళ్లం. జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టారు. దీని ద్వారా వచ్చే నగదుతో పిల్లలకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను కొని ఇస్తున్నాం. అలాగే ఆర్థికంగా ఇబ్బందులు కూడా తొలగాయి.

–షేక్ ఆషా, తెనాలి.

సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం



మాకు ముగ్గురు సంతానం. మా ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. పిల్లల్ని చదివించేందుకు ఇబ్బందులు పడుతున్న సమయంలో సీఎం జగనన్న అధికారంలోకి వచ్చి మా కష్టాలను తీర్చారు. మా పిల్లలకు అమ్మఒడి పథకం ద్వారా రూ.15 వేలు అందించారు. అంతే కాకుండా యూనిఫాం, బుక్స్ ఉచితంగా ఇస్తున్నారు. మా పిల్లల చదవుకు అండగా నిలుస్తున్న జగనన్నకు ఎల్లకాలం రుణపడి ఉంటాం.

–కె భవాని, తెనాలి.

భారీ విజయమే లక్ష్యంగా పనిచేద్దాం

- 'బ్రేక్‌ఫాస్ట్ విత్ ఎమ్మెల్యే' కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుల తీర్మానం
- ఎమ్మెల్యే శివకుమార్‌ను సత్కరించిన పార్టీ శ్రేణులు


ఎమ్మెల్యే శివకుమార్‌ను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

తెనాలి: సార్వత్రిక ఎన్నికల్లో తెనాలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులను సిద్ధం చేసే దిశగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించిన 'బ్రేక్‌ఫాస్ట్ విత్ ఎమ్మెల్యే' సమావేశాలు శనివారం కొనసాగాయి. స్థానిక ఏఎస్ఎన్ ఇంజినీరింగ్ కాలేజీ ఆవరణలో ఏర్పాటైన సమావేశానికి పట్టణ 1, 2, 19, 20, 39 వార్డులకు చెందిన పార్టీ నేతలు, ముఖ్య కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, బూత్‌లెవెల్ ఏజెంట్లు హాజరయ్యారు. అందరితో కలసి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ బ్రేక్‌ఫాస్ట్ తీసుకున్నారు. వార్డుల్లో రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రచార కార్యాచరణపై సమాలోచన చేశారు. నియోజకవర్గంలో గరిష్టంగా పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని చేకూర్చిన విషయం తెలిసిందే. గత నాలుగేళ్ల కాలంలో దాదాపు రూ.1800 కోట్లకు పైగా సంక్షేమ లబ్ధిని అందించినట్టు ఎమ్మెల్యే శివకుమార్ గుర్తుచేశారు. గతంలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 27 వేలమంది పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశామన్నారు. ప్రస్తుతం వాటి పట్టాలకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగంగా జరుగుతోందని చెప్పారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను వాస్తవాలతో సమర్థంగా తిప్పికొట్టాలని సూచించారు. ప్రతి ఇంటి తలుపు తట్టి ప్రభుత్వం చేసిన మంచిని వివరించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో గెలుపు కాదని, భారీ మెజారిటీని సాధించటమే లక్ష్యంగా పని చేస్తామని, అందుకు సిద్ధంగా ఉన్నామంటూ పార్టీ నేతలు ప్రకటించారు. ఎమ్మెల్యే శివకుమార్‌ను పూలమాలలతో సత్కరించారు. పార్టీ క్లస్టర్-1 అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, వ్యవసాయ మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ వంపుగళ్ల కృష్ణ, పార్టీ నేతలు అన్నాబత్తుని శ్రీధర్, ఎం.లక్ష్మయ్య, కాకి దేవసహాయం, అత్తోట చంటి, కాకి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

నీటి నమూనా పరీక్షలు చేపట్టండి


రక్షిత మంచి నీటిని పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: 11వ వార్డు గురవయ్య కాలనీలో పురపాలక సంఘం సరఫరా చేసే రక్షిత మంచినీటి నమూనాలను వెంటనే సేకరించి పరీక్షలు జరపాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్నలు ఆదేశించారు. గురవయ్య కాలనీలో శనివారం వారు పర్యటించారు. రెండు కుటుంబాలు డయేరియా బారిన పడినట్లు ఆరోపణలు రావడంతో ఆ ప్రాంతాన్ని వారు పరిశీలించి అనారోగ్యానికి గురైన వారితో మాట్లాడారు. వారి నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురవయ్య కాలనీలో ఇంటింటి సర్వే జరుపుతున్నట్లు చెప్పారు. ఫాగింగ్, బ్లీచింగ్ వంటి వాటిని చల్లినట్లు చెప్పారు. మంచి నీటిని ప్యూరిఫై చేసి ప్రజలకు అందించడం జరుగుతుందని తెలిపారు. వారి వెంట ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, పలువురు డీఈలు, ఏఈలు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

'ఇండ్ గ్యాప్' సర్టిఫికేషన్‌కు పంట నమూనాల సేకరణ


పసుపు పంట నమూనాలను సేకరిస్తున్న డాక్టర్ ఎం.ప్రతాపరెడ్డి

తెనాలి: శ్రేష్టమైన వ్యవసాయ పద్ధతులతో పండించిన పంటలకు 'ఇండ్ గ్యాప్' సర్టిఫికేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని మండల కేంద్రమైన కొల్లిపరలోని శ్రేష్ట రైతు ఉత్పత్తిదారుల సంఘం అందిపుచ్చుకుంది. తొలిసారిగా సంఘ సభ్యులు మంచి వ్యవసాయ పద్ధతులతో పండించిన పసుపు పంటకు ఇండ్ గ్యాప్ సర్టిఫికేషన్ ఇప్పించేందుకు తొలి అడుగు వేసింది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ ఏజెన్సీ (ఏపీఎస్ఓపీసీఏ) శనివారం కొల్లిపరలో పసుపు పంట నమూనాలను సేకరించింది. ఉద్యాన అధికారులు, రైతుల సమక్షంలో మొత్తం 24 మంది రైతుల పొలాల్లోని పసుపు నమూనాలను ఏజెన్సీ ఎక్స్‌టెర్నల్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ ఎం.ప్రతాపరెడ్డి సేకరించారు. ఎలాంటి అవశేషాలు లేని పసుపు నమూనాలకు ఇండ్ గ్యాప్ సర్టిఫికేషన్ లభిస్తుందని జిల్లా ఉద్యాన అధికారి బి.రవీంద్రబాబు వెల్లడించారు. ఈ సర్టిఫికేషన్ లభించిన పంటలకు మార్కెట్‌లో డిమాండ్ ఉంటుందని అన్నారు. ఇండ్ గ్యాప్ ఎక్స్‌టెర్నల్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ ఎం.ప్రతాపరెడ్డి మాట్లాడుతూ శ్రేష్ట రైతు ఉత్పత్తిదారుల సంఘంలో రికార్డుల పరిశీలన పూర్తిచేసి, పంట నమూనాలను సేకరించినట్టు తెలిపారు. ఇతర డైరెక్టర్లు వుయ్యూరు సాంబిరెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి

తెనాలిటౌన్: దుగ్గిరాల శుభమ్ మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో అగ్నిప్రమాదం జరిగి 35 రోజులు గడిచిన పసుపు రైతులకు నష్ట పరిహారం అందచేయకపోవడంతో ఈ నెల 26న తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు పసుపు రైతు సంఘ రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకరరావు తెలిపారు. పట్టణ ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోల్డ్ స్టోరేజీలో వంద కోట్లు నష్టం వాటిల్లినా కమిటీ నివేదిక పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. రేపల్లె మాజీ ఎమ్మెల్యే ఎం.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి అగ్ని ప్రమాద బాధితులను, పసుపు రైతులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో బాపట్ల జిల్లా సంఘ అధ్యక్షుడు వేమనపల్లి వెంకట్రామయ్య, పసుపులేటి సంఘ రాష్ట్ర కమిటీ సభ్యులు ములకా శివసాంబిరెడ్డి, రైతు నాయకులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య నేర్వాలి


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: క్రమశిక్షణతో కూడిన విద్యను విద్యార్థులు అభ్యసించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. వైష్ణవి జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలను కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళాశాల దశలోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. వాటిని సాధించే దిశగా అందరూ ప్రయత్నించాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థినులు చేసిన నృత్యాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పాటిబండ్ల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తెనాలి రైల్వే స్టేషన్ సమీపంలో ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి ఓ వ్యక్తి శనివారం 11 క్వార్టరు సీసాల మద్యం కొనుగోలు చేసి వెళుతుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడు. సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.